నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

బీమా జీవితాలకు వెలుగునిస్తుంది

నవతెలంగాణ-తిర్యాణి



కుటుంబానికి ఇన్సూరెన్స్ పాలసీ కొండంత అండగా నిలుస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు జువ్వాజీ అనిల్‌గౌడ్ అన్నారు. గ్రామానికి చెందిన విల్సన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని భార్యకు ఆదివారం మండలంలోని కొమురం భీం భవనంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మంచిర్యాల బ్రాంచ్‌లో ఆధ్వర్యంలో రూ.22,88,750 బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇందులో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఈడీ శ్రీవాస్ రెడ్డి, ఏజీఎం అట్ల సురేష్, డీఎం గుండ రాజు, జీఎం నూనె ప్రశాంత్, డీఈఎం బొద్దున లలిత రమేష్, కాంగ్రెస్ అధ్యక్షుడు చిత్తరి సాగర్, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు మేడిశెట్టి శంకర్, యూత్ మండలాధ్యక్షుడు పున్నం హరీష్‌కుమార్, పెరుమళ్ల వెంకటేశం గౌడ్, మార్క శంకర్ గౌడ్, తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్రాంచ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓపెన్ బాడీ బిల్డింగ్‌కు పోటీల్లో జిల్లా వాసులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో జరిగే ఓపెన్ బాడీ బిల్డింగ్ ఫిజికల్ స్పోర్ట్స్ చాంపియన్ పోటీలకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని విశాల్ న్యూ లుక్ పవర్ జిమ్ లో శిక్షణ పొందిన ఆరుగురు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిమ్ నిర్వాహకుడు కాంద్రి విశాల్ మాట్లాడుతూ ప్రతిరోజు వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం నిలకడగా ఉంటుందన్నారు. యువత చెడు అలవాట్లు మాని ప్రతిరోజు గంట పాటు జిమ్ చేస్తే యూనిఫాం ఉద్యోగాలకు సులభంగా అర్హత సాధించే అవకాశం ఉంటుందన్నారు. మారుమూల జిల్లా నుండి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపిక కావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఇది మరింత మందికి ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు.

రైతు భరోసాపై ఆశలు..!

రైతు భరోసా పథకంపై అన్నదాతలు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి అందిస్తున్న పెట్టుబడి సాయంలో జాప్యం జరగడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం మూడు ఎకరాల వరకే ఈ సాయం ఆగిపోగా.. మిగితా రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా సాయం నిలిచిపోయిందనే సమాచారంతో రైతులు వేచి ఉన్నారు. కానీ ప్రస్తుతం కోడ్ లేకపోవడంతో ఇప్పటికైనా ప్రభుత్వం అందజేస్తుందని భావించారు. కానీ ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటం కారణంగా తీవ్ర అసహానికి గురవుతున్నారు. అటు ప్రభుత్వ పెద్దలు సైతం అందరికీ రైతు భరోసా అందిస్తామని చెబుతున్నా.. కార్యరూపం దాల్చడంలో ఆలస్యం జరుగుతుండటంతో కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు సైతం ఎప్పటి వరకు ఈ సాయం వస్తుందో చెప్పలేకపోవడం రైతులను అసంతృప్తికి గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

- మూడు ఎకరాలకే ఆగిపోయిన పెట్టుబడి సాయం
- ఇందులోనూ కొంత మంది ఖాతాల్లో జమ కాని వైనం
- ఆతృతగా ఎదురుచూస్తున్న మిగితా అన్నదాతలు
- ప్రభుత్వ జాప్యంతో కర్షకులకు ఆర్థిక ఇబ్బందులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయం భారంగా మారుతున్న రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తూ ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. ఎకరానికి రూ.5వేల చొప్పున ...ఎన్ని ఎకరాలు ఉంటే అన్నింటికీ ఈ సాయం అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుభరోసా పేరుతో ఈ సాయాన్ని ఎకరానికి రూ.6వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో ఖరీఫ్‌లో ఈ సాయం ఇవ్వలేకపోగా.. తాజాగా యాసంగి పంటలకు ఈ సాయం వర్తింపజేస్తోంది. తొలుత ఎకరం లోపు ఉన్న వారికి..ఆ తర్వాత ఎకరం, రెండు ఎకరాలు, ప్రస్తుతం మూడు ఎకరాలు కలిగిన రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించింది. ఈలోపు ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో కోడ్ సమస్య కారణంగా ఈ సాయం వర్తింపులో జాప్యం జరిగింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసిపోవడంతో రైతులు ఆశగా పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మూడు ఎకరాలు కలిగిన రైతులకు ఈసాయం జమ కాగా..ఇందులోనూ కొంత మంది రైతులకు ఖాతాల్లో జమ కాలేదని చెబుతున్నారు. దీంతో ఎవరికి జమ అయ్యాయి..ఇంకా ఎవరికి కాలేదో..ఎందుకు కావడం లేదో తెలియక వారంతా అయోమయానికి గురవుతున్నారు.

అన్నదాతల్లో ఆందోళన..!

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుభరోసా పథకంలో మార్పులు తీసుకొస్తామని చెప్పింది. సాగుకు యోగ్యంలేని భూములను రైతు భరోసా జాబితా నుంచి తొలగించింది. కానీ అందరికీ ఇస్తామని చెప్పింది. దీంతో రైతులంతా ప్రభుత్వ సాయం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1.62లక్షల మంది రైతులు ఉండగా 5.32లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీరందరికీ రైతుభరోసా సాయం రూ.320కోట్లు అవసరమవుతాయి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఒక ఎకరం కలిగిన 14,722మంది రైతులకు రూ.18.01కోట్లు జమ చేయగా.. రెండు ఎకరాలు కలిగిన 34,401మంది రైతులకు రూ.37.18కోట్లు, మూడు ఎకరాలు కలిగిన 65,547మంది రైతులకు ప్రభుత్వం రూ.79.04కోట్లు జమ చేసింది. కానీ మిగితా నాలుగు ఎకరాలు, అంతకంటే అధికంగా ఉన్న రైతులకు ఇంకా జమ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. యాసంగి సీజన్ కూడా ముగిసే దశకు రావడం.. మరికొన్ని రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట పెట్టుబడికి డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయడం మూలంగా కర్షకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విడతల వారీగా జమ చేస్తోంది

శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి,ఆదిలాబాద్

ప్రభుత్వం రైతుభరోసా సాయాన్ని ఇప్పటి వరకు 3 ఎకరాలకు అందించింది. కొందరికి 3.20ఎకరాల వరకు ఖాతాల్లో జమ అయిందని తెలిసింది. విడతల వారీగా ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ సాయం అందజేస్తుంది.

సాయం త్వరగా అందించాలి

సింగిడి నారాయణ, రైతు, జైనథ్



నాకు నాలుగు ఎకరాలకు పైగా భూమి ఉంది. రబీ సీజన్‌లో కంది, గోధుమ పంటలు సాగు చేశాను. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడంలో జాప్యం చేయడం మూలంగా దళారుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఈ ప్రక్రియలో జాప్యం చేయకుండా త్వరగా రైతుభరోసా సాయం అందించాలి.

మహాసభకు తరలిన పద్మశాలీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం చేపడుతున్న 17వ అఖిల భారత పద్మశాలీ మహాసభకు జిల్లా నుండి పద్మశాలీలు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతామని సీఎం ప్రకటించడం పట్ల పద్మశాలీల్లో హర్షం వ్యక్తమవుతున్నట్లు పేర్కొన్నారు. తరలివెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్లా ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు నల్ల కనకయ్య, శంకర్, ఆసిఫాబాద్ అధ్యక్ష కార్యదర్శులు హనుమండ్ల శ్రీకాంత్, ఆల్లె శ్రీకాంత్, కోమటిపల్లి లింగయ్య, రమేష్, చందు, మంగ, సునీత ఉన్నారు.

గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-తాండూర్

గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్, రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడిగా హుస్సేన్(నేరేడుచర్ల బ్రాంచ్), ప్రధాన కార్యదర్శిగా కస్తాల మధు(హుజూర్నగర్ బ్రాంచ్), ఉపాధ్యక్షుడు చింతకింది ఎల్లం (ములుగు జిల్లా), హద్నూరు అంకుష్ కుమార్(సంగారెడ్డి జిల్లా), కోశాధికారిగా ఖమ్మంపాటి మధుసూదన్(పెన్ పహాడ్ బ్రాంచ్), సహాయ కార్యదర్శిగా సయ్యద్ సలీం(ఆసిఫాబాద్ జిల్లా), చెరుకుపల్లి స్వామి(మంచిర్యాల జిల్లా), కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

గెలుపోటములు సహజం



నవతెలంగాణ-జైనూర్

ఆటలో గెలుపు ఓటములు సహజమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్నాక్ విజయ్ అన్నారు. ఆదివారం మండలంలోని దుబ్బాగూడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీ ఫైనల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని, శారీరక దారుఢ్యం లభిస్తుందని అన్నారు. చెడు మార్గాల్లో వెళ్లకుండా ఆటపాటల్లో, చదువులో రాణించాలని యువతకు పిలుపు నిచ్చారు. మొదటి స్థానంలో నిలిచిన తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జట్టు క్రీడాకారులకు ట్రోఫీ, రూ.20వేల నగదు, ద్వితీయ బహుమతిగా జైనూర్ కేకే టీంకు రూ.10 వేల నగదు ట్రోఫీ అందజేశారు. ఇందులో క్రీడా మేనేజ్‌మెంట్ సభ్యులు పెందోర్ దౌలత్ రావు, గ్రామ పటేల్ దేవాది పాల్గొన్నారు

పిక్చర్ టైం థియేటర్‌లో క్రికెట్ ప్రత్యక్ష ప్రసారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పిక్చర్ టైం థియేటర్‌లో ఆదివారం ఇండియా, న్యూజిలాండ్ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను థియేటర్ నిర్వాహకుడు అనిల్‌కుమార్ ప్రత్యక్ష ప్రసారం చేశారు. రూ.150 టికెట్ ధర నిర్ణయించగా పట్టణ ప్రజలు ఆసక్తి చూపారు. థియేటర్‌లో క్రికెట్ చూడడంతో మైదానంలో ఉండి చూసినట్లు అనిపించిందని క్రికెట్ ప్రియులు సంతోషం వ్యక్తం చేశారు. నిర్వాహకుల ఆలోచనను పలువురు అభినందించారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారికి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఖానాపూర్‌కు చెందిన నేషనల్ సోల్జర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఉద్యోగం సాధించిన యూత్ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని స్థానిక గాంధీ పార్క్‌లో నిర్వహించారు. యూత్ సభ్యుడు ఇజ్జగిరి నవీన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ నిర్వహించిన గురుకుల పరీక్షల్లో తెలుగు అధ్యాపకునిగా ఎంపికయ్యారు. అదేవిధంగా గ్రూప్ ఫోర్త్ పరీక్షల్లో మోకానపల్లి మహేందర్ జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు నెరవట్ల వినోద్ కుమార్ మాట్లాడుతూ యూత్ సభ్యులు ఉద్యోగాలు సాధించడం ఎంతో ఆనందానిచ్చిందని అన్నారు. ఈ విజయం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా ఉంటుందని, ఇలాంటి విజయాలు భవిష్యత్తులో యూత్ సభ్యులు సాధిస్తే సన్మాన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ గ్రహితలు మాట్లాడుతూ ఈ సన్మాన కార్యక్రమం అంతేకాకుండా సమాజం పట్ల బాధ్యతలు కూడా పెంచిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మల్యాల కరుణాకర్, మోకెనపల్లి రాజేందర్, పులిపాక నరేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు టీడబ్ల్యూజేఎఫ్‌తోనే పరిష్కారం

- రాష్ట్ర కార్యదర్శి బసవపున్నయ్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జర్నలిస్టుల సమస్యలు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్‌తోనే పరిష్కారమవుతాయని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బసవపున్నయ్య అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్‌కు వచ్చిన ఆయన సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్‌తో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఇప్పటి వరకు జర్నలిస్టుల సమస్యల పరిష్కారం గురించి ప్రభుత్వం ఆలోచన చేయడం లేదని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, నూతన అక్రిడేషన్ల మంజూరు, హెల్త్ కార్డుల జారీ, ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాల గురించి ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నారు. అందుకే టీడబ్ల్యుజేఎఫ్ ప్రస్తుతం పోరాటాల బాటను ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోందని, ఇందులో భాగంగానే మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు వచ్చినట్లు తెలిపారు. నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన జర్నలిస్టులకు సంఘంలో సభ్యత్వం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి సురేందర్‌రావు, నీలి సతీష్, ఉపాధ్యక్షులు పుల్లూరు సంతోష్, కోశాధికారి కృష్ణమోహన్‌గౌడ్, జర్నలిస్టులు పైడి సంతోష్, ఎం విష్ణుగౌడ్, బి అనిల్‌కుమార్, బి కిరణ్‌కుమార్, పి నాగేందర్, బి వెంకన్న, డి శ్రీధర్, ముఖషిర్‌పాషా, ఎస్ రాజ్‌కుమార్, డి లక్ష్మణ్, జె లలిత్, సదాశివ్, ధనుంజయ్ పాల్గొన్నారు.

నేతకాని, మహర్‌లను గ్రూప్-2లో చేర్చాలి

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం నేతకాని, మహర్ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కొత్తపల్లి గంగేష్ ఆధ్వర్యంలో నేతకాని, మహర్ కులస్తులను గ్రూప్-2లో కలుపాలని లేదా ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శాంతియుత ధర్మ పోరాట దీక్షను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుల్లె వెంకటేష్ మాట్లాడుతూ ఏజెన్సీ దళితుల న్యాయమైన డిమాడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ ఉపాధి లేని దళిత నిరుద్యోగులు ఏజెన్సీ ఉమ్మడి జిల్లాలు ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ప్రజలు ఏజెన్సీ గ్రామాలలో సుమారుగా దళితులు పదిహేను లక్షల మంది ఉన్నారన్నారు. రాష్టంలో ఉన్న గత ప్రభుత్వ పాలకులు, ఇపుడు ప్రభుత్వ పాలకులు ఏజెన్సీ దళితులను పట్టించుకోవడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో దళితుల స్థితిగతులను పరిశీలించి, 1918 జనవరి 22న నోటిఫికేషన్ నెంబర్-187 ప్రకారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించామన్నారు. ఆ నివేదికలో పత్రం పార్ట్-1 పేజీ నెంబర్ 710 ఏప్రిల్ 19న 1932 ప్రకారం ఏజెన్సీ దళితులను కొండ గిరిజనులుగాను, హిల్ ట్రైబ్స్‌గాను గుర్తించారు. ఈ విషయాలను 1935లో భారత ప్రభుత్వ చట్టంలో పొందుపరచారు. 1935 భారత చట్టాన్నే 2/3 వంతు భారత రాజ్యాంగంలోనికి అనువాదించారు. కానీ పోర్ట్ సెయింట్ జార్జ్ ప్రవేశ పెట్టిన నోటిఫైడ్‌ను మాత్రం విస్మరించారు. తాము ఏజెన్సీ గ్రామాలలో తరతరాలుగా, స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఆదివాసులతో కలిసి వారితో సహజీవనం చేస్తున్నామన్నారు. ఆ ప్రాంతంలో జీవిస్తున్నప్పటికీ దళిత నిరుద్యోగులకు ఉద్యోగాలు రావటం లేదన్నారు. భారత రాజ్యాంగం దళితుల అభివృద్ధి కోసం అన్ని ప్రభుత్వ శాఖలలో 15 శాతం రిజర్వేషన్ ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుతం ఏజెన్సీ దళితుల కోసం ప్రతేకంగా ఐటీడీఏ తరహాలో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనీ ఏజెన్సీ దళిత నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో న్యాయ సలహాదారులు పసుల రాజలింగంతో పాటు మహిళలు పాల్గొన్నారు.

మార్పుకు మరో రూపం మహిళ

- ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పుకు మరో రూపం మహిళ అని అన్నారు. సేవా అధ్యక్షురాలు సుమిధ శ్రీనివాసులు సందర్భంగా మహిళ ఉద్యోగులకు ఇతర మహిళలందరికీ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ హెడ్ ఆఫ్ ది ప్లాంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. స్త్రీలు తలచుకుంటే [illegible] అలాగే ప్రతి రంగంలోనూ వారు రాణించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 ఇతివృత్తం అన్నారు. సేవా అధ్యక్షురాలు సుమిద శ్రీనివాసులు మాట్లాడుతూ. స్త్రీలు ఇప్పటికీ కొన్ని చోట్ల అణచివేతకు గురి అవుతున్నారని, వాటిని అధిగమిస్తూ ముందుకు రావాలని కోరారు. సమాజంలో సమానత్వం అనేది అక్షరాస్యతతో మాత్రమే సాధ్యమవుతుందని, ప్రతి ఒక్క స్త్రీ విద్య లో రాణించాలన్నారు. మన హక్కులు. సమానత్వం. సాధికారత కోసం మన వంతు కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ మహిళలుగా ఎంపికైన పద్మ మోహన్ సింగ్, పుష్పలత శ్రీనివాస్, శ్రీమతి మల్లికాంబ, మారుతిప్రసాద్, మానేజర్ ఫారెస్ట్ శ్రీమతి చంద్రమణి, శ్రీమతి అరుణ, శైలజను ఘనంగా సన్మానించారు. ఆటలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సంగీత జేఎస్ సింగ్, కృష్ణవేణి సత్యనారాయణ, సౌజన్య శ్రీనివాస్, స్రవంతి వేణుగోపాల్, మహిళా ఉద్యోగినులు ప్రియాంక, అరుణ, శ్రీనిధి, సంతోష రాణి, స్ఫూర్తి, రవళి పాల్గొన్నారు.

స్వర్ణకారుల ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వర్ణకార మహిళల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పట్టణంలోని స్వర్ణకార మహిళలు స్థానికంగా ఓ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ త్యాగానికి మారుపేరు మహిళ అని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక కూడా ఎందరో మహిళల త్యాగం ఉందని గుర్తుచేశారు. మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు తమ శక్తిని తెలుసుకొని అన్ని రంగాల్లో తమను తాము నిరూపించుకోవాలని అన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీలు సరదాగా సాగాయి. చిన్నారులు, యువతులు, మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలులోకి తీసుకురావాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఎస్సీ వర్గీకరణ అమల్లోకి తేకుండానే ఉద్యోగ నియామకాలు చేయవద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ అన్నారు. ఆదివారం మండలంలోని దేగామ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షులు గోధుమలే అనిల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత రాకముందే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మొదలగు ఉద్యోగ ఫలితాలు విడుదల చేస్తామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తీవ్ర అన్యాయమైన చర్య అని, దీని ద్వారా మాదిగలు, ఉప కులాలకు అలాగే ఎస్సీ వర్గీకరణ కోరుతున్న అన్ని కులాలకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు ఉద్యోగ నియామకాలు చేపట్టమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగ నియామకాలకు సిద్ధపడటం, చేపట్టడం దారుణమని, ఉద్యోగ నియామకాల ఫలితాలు వెంటనే నిలిపివేయాలని, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తరువాతనే అన్ని రకాల ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రేపటి నుంచి ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ, అన్ని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర సీనియర్ నాయకులు, దుబ్బాక సుభాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బారుకుంట సుభాష్, జిల్లా నాయకులు, సుంకే అనిల్, మహేందర్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



స్వాతంత్ర, తెలంగాణ పోరాట సమరయోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు పెట్టుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన అఖిలభారత పద్మశాలి సంఘం 17వ మహాసభలో ప్రకటించారు. కళాశాల ఏర్పాటు అయినప్పటి నుండి ఈ ప్రాంతంలో తెలంగాణవాదులు, బాపూజీ అభిమానులు, పద్మశాలీలు కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ నామకరణం చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులకు, కలెక్టర్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి దష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంత ప్రజల విన్నపం మేరకు ప్రభుత్వం కళాశాలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నామకరణాన్ని ప్రకటించడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహనీయుని పేరు ప్రకటించడంతో పద్మశాలీలు సంబరాలు జరుపుకుంటున్నారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి పద్మశాలిలో కతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మండలం చిట్యాల్ గ్రామం నుంచి గాంధీనగర్ వరకు రూ.25 కోట్లతో చేపట్టే ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిట్యాల్ గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ తనకు అండగా ఉన్నారని, ఈ గ్రామాభివృద్ధికోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ రోడ్డు నిర్మాణం 2 నెలలో పూర్తి చేసేలా అధికారులను



సూచించారు. అనంతరం గ్రామంలోని పలు ఆలయాలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, జిల్లా బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, జమాల్, భూపాల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, భూపతిరెడ్డి, అశ్వత్థామ, రాజేశ్వర్, ముత్యం, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

నిర్మల్‌లో వాల ఆధ్వర్యంలో 5కే రన్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

వాకింగ్ అండ్ లాఫింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 5కే రన్ నిర్వహించారు. నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ నుంచి పీవీ నర్సింహారావ్ చౌరస్తా మీదుగా శివాజీ చౌక్ తిరిగి డిగ్రీ గ్రౌండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా క్రీడలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 16న నిర్వహించే సర్వసభ్య సమావేశాన్నికి వాలా సభ్యులు పాల్గొనాల్సిందిగా కోరారు.



ఉద్యోగికి బదిలీలు సర్వసాధారణం

- ఘనంగా ఎస్పీ గౌస్‌ఆలంకు వీడ్కోలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బదిలీలు సర్వసాధారణమని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బదిలీ అయిన ఎస్పీకి విధాయి పరేడ్ నిర్వహించి, పోలీసుల గౌరవ వందనాలు సమర్పించి, గజ మాలతో సత్కరించారు. అనంతరం వాహనంలో జిల్లా ఎస్పీని హెడ్ క్వార్టర్స్ గేట్ వరకు జిల్లా పోలీసు అధికారులందరూ సిబ్బందితో సహా ఏర్పాటు చేసిన తాడును లాగి సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చేసిన సేవలు మరువలేనివని సిబ్బందిని వీడి పోవడం బాధాకరమన్నారు. 14 నెలల పాటు చేసిన సేవలు జిల్లా పోలీసులతో తన అనుబంధాన్ని పంచుకున్నారు. జిల్లా పోలీసు సిబ్బందికి, డీపీఓ సిబ్బందికి పోలీసు అధికారులకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపడంలో జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలనలో ప్రత్యేకంగా కీలక పాత్ర పోషించినట్టు తెలిపారు. అదేవిధంగా శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కష్టపడుతూ పార్లమెంటు ఎన్నికలను గణపతి, దుర్గాదేవి, రంజాన్ పండుగలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి చేశామన్నారు. విపత్తుల సమయంలో జిల్లా స్థాయిలో మొదటిసారిగా 20 మంది పోలీసు సిబ్బందితో డిజాస్టర్ రెస్పాన్స్‌ను స్థాపించామని తెలిపారు. వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ వచ్చే సమయంలో జిల్లాలో సత్వరమే స్పందించి, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా, ఈ డీడీఆర్‌ఎఫ్ బృందం పనిచేస్తుందన్నారు. అదేవిధంగా ఆదివాసులకు ప్రత్యేకంగా మారుమూల గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సదుపాయాన్ని చేరువ చేశారు. శీతాకాల సమయంలో నిరుపేదలైన ఆదివాసులకు రెండు వేల బ్లాంకెట్లను పంపిణీ చేసి సహాయపడ్డమన్నారు. పోలీసులు మీకోసంలో భాగంగా ఆదివాసీ యువత క్రీడలలో చదువులో ఆసక్తిని పెంపొందించడానికి పుస్తకాలను స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశామన్నారు. ప్రత్యేకంగా జిల్లా వ్యాప్తంగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించి, వారిలో ఉన్న క్రీడా స్ఫూర్తిని పెంపొందించారు. సిబ్బందితో నిరంతరం సమీక్ష సమావేశాలను ఏర్పాటు చేసి పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసిన సందర్భంగా జాతీయ ఎన్నికల సంఘం తరఫున వచ్చిన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సిబ్బందికి మునుపెన్నడూ లేనటువంటి సౌకర్యాలను కల్పిస్తూ సిబ్బంది పనితనాన్ని మెరుగుపరిచేలా తరదైన ముద్రను జిల్లాలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్ జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, సిహెచ్ నాగేందర్, హసీబుల్ల, సీఐలు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్లు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



సుభాష్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత విప్లవ ఉద్యమ నేత రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకటనారాయణ అన్నారు. సుభాష్ చంద్రబోస్ అలియాస్ రవన్న 9వ వర్ధంతి సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యాలయం కుమురంభీం భవనంలో రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట నారాయణ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పిండిప్రోలు గ్రామంలో పుట్టి విద్యార్థి దశలోనే తిరుమలాయపాలెం మండలంలో భూస్వాములకు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. ఈ దేశంలో ఉన్నటువంటి అర్థ వలస, అర్థ భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించి, ఆ స్థానంలో వ్యవసాయక విప్లవాన్ని ఇరుసుగా చేసుకుని కార్మికవర్గ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించాలని భావించి, అందుకు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాయే సరియైన మార్గమని పేర్కొన్నారు. ఆనాడు పార్టీలో అతివాదులకు, అవకాశవాదులకు, చీలిక వాదులకు, వ్యతిరేకంగా పార్టీని ఆయన జీవితాంతం సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీగానే ఐక్యంగా పార్టీని కాపాడారని పేర్కొన్నారు. ప్రజా సంఘాలు పెట్టి ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి విద్యా, వైద్యం, పంటలకు గిట్టుబాటు ధరలు, కార్మిక సమస్యలు, భూసమస్యలు తాగునీటి కోసం, సాగునీటి కోసం ప్రాజెక్టుల నిర్మాణం కోసం అనేక పోరాటాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్, దేవిదాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, గణేష్ ఐఎఫ్టియు నాయకులు ఉల్లరాజ్, కొండయ్య కిషన్ పీఓడబ్ల్యు జిల్లా నాయకులు లక్ష్మి రాజు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మూగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పలువురు మహిళా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మహిళా సాధికారత, వివిధ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్ కుమార్ మాట్లాడారు. నూతన పీఆర్సీని ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కుబేర్‌లో ఉన్న అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే రిలీజ్ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సర్వీస్ రూల్స్ సాధించి అన్ని రకాల క్యాడర్లలోని ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని అన్నారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన టీచర్స్‌ని వెంటనే సొంత జిల్లాలకు పంపాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దిలేష్ చౌహన్, రాష్ట్ర క్రీడల కన్వీనర్ పుప్పాల నరేందర్, జిల్లా కోశాధికారి భానోత్ మనోహర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జాదవ్ రవికుమార్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు మొదలు పెట్టాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వం మూడు నెలల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు ప్రభుత్వం మొదలు పెట్టాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ ప్రతీ గింజ కొనే బాధ్యత ప్రభుత్వానిదే లేదంటే 10వేల మందితో భారీ ధర్నా చేపడతామని అన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వయసు మీదపడి మతి భ్రమించి మాట్లాడటం సరికాదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టా రీతిన అక్రమాలు, భూకబ్జాలు, చేసి జిల్లాను అస్తవ్యస్తంగా చేశారని గత ప్రభుత్వ హయాంలో పామ్ ఆయిల్ కంపెనీకి 40 ఎకరాల ప్రభుత్వ భూమిని సొంత పార్టీకి చెందిన ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టిందన్నారు. సిద్దిపేటలో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్‌కు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఇచ్చినపుడు, నిర్మల్‌లో మాత్రం ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటన్నారు. పాక్‌పట్ల గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఓ ప్రయివేటు కంపెనీకి తక్కువ ధరకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కొరకు భూములు ఇప్పించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేవలం కమిషన్లకు ఆశపడి భూములను అప్పనంగా అప్పగించారని విమర్శించారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రతిదీ రాజకీయం చేయడం సరికాదని, ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క దగ్గర ధర్నా చేయాలని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ప్రజలు మాజీ మంత్రికి రిటైర్మెంట్ ప్రకటించి, గత ఎన్నికల్లో ఓడించారని గుర్తు చేశారు. ఓటమి చెంది నెల రోజులు గడవక ముందే అధికార పార్టీలో చేరింది అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి కాదా అన్నారు. తన సొంత తమ్ముళ్ల చేసిన అక్రమాలు, ఇరిగేషన్ నాళాలు పూడ్చి అనుమతులు లేకుండా లేఔట్‌లు చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. గతంలో మీ హయాంలో జరిగిన డీ-1 పట్టాలపై, డీ-మార్ట్ నిర్మాణాలపై ఎంక్వైరీ చేయిస్తున్నామని తెలిపారు. అధికార పార్టీలో ఉండి ఈ ఎంక్వైరీని అడ్డుకునే ప్రయత్నం చేస్తే రాబోయే మా ప్రభుత్వంలో తప్పక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, పట్టణాధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు ముత్యంరెడ్డి, భూపాల్ రెడ్డి, సాదం అరవింద్, భూపతి రెడ్డి, వొడిసేల అర్జున్, మండలాధ్యక్షులు మార గంగారెడ్డి, బర్కుంట నరేందర్, నర్సరెడ్డి, నాయకులు విజయ్, రాజేందర్, దత్తూరాం పాల్గొన్నారు.

రామారావు బాపు మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

రామారావు బాపు మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని, ఆదివారం కమిటీ సభ్యులు ఉట్నూర్‌లోని మాజీ జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐక్యంగా విగ్రహం నిర్మాణానికి కృషి చేస్తున్న చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామస్తులను, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు, చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులే ఉత్తమ నాయకులుగా ఎదుగుతారు

- ఎస్టీయూ రాష్ట్ర స్థాయి కార్యాశాల



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఉత్తమ ఉపాధ్యాయులే ఉత్తమ నాయకులుగా ఎదుగుతారని మాజీ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం భవనంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళ కార్యకర్తల కార్యాశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కల్చరల్ యాక్టివిటీస్‌లో నిర్మల్ జిల్లా మహిళా ప్రతినిధులు శ్రీదేవి, మీనా, రాణి, కే.సుజాతలు పాల్గొని బహుమతులను గెలుపొందారు. ఈ కార్యశాలలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పర్వతరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందంగౌడ్ పాల్గొన్నారు.

బోల్తా పడ్డ ఇసుక ట్రాక్టర్ తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని కచ్‌కంటి గ్రామ శివారులో ఆదివారం ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఎవరు లేని సమయంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడటంతో ట్రాక్టర్‌పై ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని కచ్‌కంటి గ్రామస్తులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ బోల్తాపడటంతో డ్రైవర్ ఎగిరిపోయాడు. ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నాడు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు



నవతెలంగాణ-ఉట్నూర్

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన బాలింత రక్తహీనతతో శనివారం తెల్లవారు జామున మృతి చెందిందని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు డిమాండ్ చేశారు. ఆదివారం మృతురాలి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బాలింత మృతి చెందిన సంఘటన అందరి హృదయాలను కలచివేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గిరిజన శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కొలాం గిరిజనుల కోసం ప్రత్యేకమైన శాఖ ఉందని, కొలాం డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఐటీడీఏ పీఓ, పీవీటీజీ అంతరించిపోతున్న కొలాం గిరిజనుల అభివృద్ధి కోసం పనిచేస్తున్నాయన్నారు. ఐటీడీఏలో ప్రత్యేక వాహనాలు కేటాయించి, గిరిజనుల అభివృద్ధి కోసం పీవీటీజీలు మారుమూల గ్రామాలలో నివసిస్తున్న గర్భవతుల, బాలింతల, పసిపిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ అవి వారి దరి చేరకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉన్నట్టు కండ్లకు కట్టినట్టుగా కనిపిస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రవేశపెట్టి, గిరిజనులను చైతన్య పరచడానికి ప్రతి మారుమూల గ్రామంలో కళాజాత బృందాలచే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. మృతి చెందిన శ్రీవిద్య కన్న పసిపాప పాలన కోసం ప్రభుత్వం పాడి ఆవుని, లేక గేదెను సమకూర్చి, పసిపాపకు పాలు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి రఘోత్తంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అమృతరావు, కమిటీ సభ్యులు మేడ మురళీధర్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌కు ఎంపికైన కుమారి విద్యార్థులు



నవతెలంగాణ-నేరడిగొండ

ఇటీవల విడుదలైన ఇన్‌స్పైర్ అవార్డుల్లో కుమారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 9వ తరగతి కి చెందిన ఆకుల చైత్రలి రూ.10వేలు, చెమ్మన అర్చన రూ.10వేల నగదు బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మెన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఏమాయికుంట గ్రామంలో లీగల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ పోటీలను మార్కెట్ కమిటీ చైర్మెన్ ముఖాడే ఉత్తం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పూలాజీ బాబా ధ్యాన మందిర వార్షికోత్సవం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కుచులాపూర్ గ్రామంలో సిద్దేశ్వర సంస్థాన్ పట్నాపూర్ ధ్యాన మందిర శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పూలాజి బాబా 29వ వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మొదటగా జెండాను ఆవిష్కరించి, మహిళలు మంగళ హరతులతో పూజలు నిర్వహించి, సామూహిక ధ్యానం చేశారు. ఆదిలాబాద్ నుంచి వచ్చిన బాబా భక్తులు సతీష్ గురునులే కమిటీ సభ్యులు షిండే రాములు మాట్లాడుతూ ధ్యానం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చని, ధ్యానం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొంది భగవంతుని మనలోనే పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే, ధ్యాన మందిర కమిటీ అధ్యక్షులు రవీందర్ పెట్కులే, లాల్‌గడ్ ధ్యాన మందిర కమిటీ అధ్యక్షులు నందీశ్వర్, గోషే విజయ్ వాడగురే, రమేష్ పెట్కులే, లక్ష్మీ మాందాడే, సునంద గురునూలే, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో ప్రసవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన మోతిరామ్ భార్య హారికను డెలివరీ కోసం ఆదివారం అంబులెన్స్‌లో మంచిర్యాలకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువగా రావడంతో ఈఎంటి టెక్నీషియన్ వెంకటేష్, పైలెట్ కార్తీక్‌లు డెలివరీ చేశారు. ఆమెకు ఇద్దరు కవలలు జన్మించారు. ఇద్దరు ఆడపిల్లలు, తల్లి క్షేమంగా ఉన్నారు. దీంతో దంపతులు ఈఎంటి టెక్నీషియన్‌తో పాటు, పైలట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని బాలేపల్లి గ్రామంలో కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. కౌటాల-బాలేపల్లి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా కౌటాల జట్టు గెలుపొంది రూ.30 వేలు ప్రైజ్‌మనీ సొంతం చేసుకుంది. రన్నరప్‌గా బాలేపల్లి జట్టు నిలిచి రూ.20 వేలు గెలుచుకుంది. గెలుపొందిన జట్లకు కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య ట్రోఫీ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆడే వసంత్ రావ్, డొంగ్రే మధుకర్, గ్రామపెద్దలు వాసుదేవ్, సుభాష్, కాశీనాథ్, లవ్‌దీప్, యువకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని గుండ్లపేట గ్రామ యువకులకు ఎస్సై కొమురయ్య వాలీబాల్ కిట్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువత క్రీడల్లో పాల్గొనాలని క్రీడలతో మానసికల్లాసం ఉంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, యువకులు పాల్గొన్నారు.

మహిళా వైద్యుల ఔదార్యం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని మహిళా వైద్యులు ఒక విద్యార్థినికి ఏడాదికయ్యే ఫీజును చెల్లించేందుకు ముందుకు వచ్చారు. స్థానిక మహిళా వైద్యులు కె.అనిత, హారిక, ఉషాలత, స్రవంతి, జ్యోతి, కీర్తి, నీరజ, స్రవంతితో పాటు ఇతర వైద్యుల సతీమణులు ప్రజ్వల, జ్యోతిర్మయి, గాయత్రి, తబసుం, కళ్యాణిలు శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థినికి ఒక ఏడాదికయ్యే ఫీజును చెల్లించేందుకు నిర్ణయించారు. ఆ మొత్తాన్ని ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అందించారు.

వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్‌గా మాజీ జెడ్పీటీసీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం త్వరలో దేశంలో అమలు చేయనున్న వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రక్రియకు సంబంధించి అభిప్రాయాల సేకరణ కోసం నియమించిన కమిటీకి జిల్లా కన్వీనర్‌గా మాజీ జెడ్పీటీసీ జిల్లా నాయకుడు అరిగెల నాగేశ్వరరావును నియమించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపీ రఘునందన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ప్రకటింటించినట్లు పేర్కొన్నారు. జిల్లా కో కన్వీనర్‌గా వీరబ్రహ్మాచారిని నియమించారు. ఈ సందర్భంగా నూతన సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు శాలువాతో ఘనంగా సన్మానించారు.

జాతరకు పోటెత్తిన జనం



నవతెలంగాణ-కెరమెరి

కెరమెరి జాతరకు ఆదివారం జనాలు పోటెత్తారు. శివరాత్రి మొదలు శనివారం వరకు జాతర లేక వెలవెలబోయింది. ఆదివారం వారసంత కావడంతో మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు పోటెత్తారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులు, రంగుల రాట్నం, బ్రేక్ డాన్స్, పిల్లల ట్రైన్ వంటివి పిల్లల్ని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతర యువత, మహిళలు, చిన్నారులతో సందడిగా మారింది. జనాలతో కొనుగోలు దుకాణాలు కిక్కిరిసిపోయి కనిపించాయి.



అత్యాచార నిందితున్ని కఠినంగా శిక్షించాలి

- కాగజ్‌నగర్‌లో సీఐటీయూ భారీ ర్యాలీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై అత్యాచారానికి పాల్పడ్డ నిందితునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక అంబేద్కర్ చౌక్ నుండి వివిధ వార్డుల మీదుగా రాజీవ్ చౌక్ చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా రాయికల్‌లో ఆశ వర్కర్ విధులు ముగించుకొని ఇంటికి వెళుతున్న క్రమంలో అత్యాచారానికి గురైందని, ఈ ఘటన జరిగి 10 రోజులు కావస్తున్నా నిందితున్ని ఇప్పటి వరకు పోలీసులు అరెస్ట్ చేయలేదని అన్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినపుడు పోలీసులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే పునరావృతమవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితున్ని కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి మెరుగైన వైద్యం, రూ. 50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, శంకర్, కార్యదర్శి ఆర్ త్రివేణి, పద్మ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో సీఐటీయూ ర్యాలీ

మార్లవాయి గ్రామాన్ని సందర్శించిన ఎన్ఆర్ఐ వైటీపీ బృందం



నవతెలంగాణ-జైనూర్

అమెరికా ఎన్ఆర్ఐ వైటీపీ బంద సభ్యులు ఆదివారం మండలంలోని మార్లవాయి గ్రామాన్ని సందర్శించారు. ఆదివాసీ గ్రామాల మీదుగా తిరుగుతూ మార్లవాయికి చేరుకున్న వారు హెమన్‌డార్ఫ్, బెట్టి ఎలిజబెత్ దంపతుల సమాధుల సందర్శించి ఘన నివాళులు అర్పించారు. అలాగే పద్మశ్రీ కనక రాజు గుస్సాడి కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. అనంతరం మార్లవాయి ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. తాము మేము కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు అమెరికా వెళ్లడం జరిగిందన్నారు. మాత దేశ ప్రజలకు సేవ చేయాలని ఆలోచనతో అనేక గ్రామాన్ని దత్తగా తీసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆదివాసి పోరాట యోధుడు కొమరం భీమ్, ఆదివాసి ఆత్మబంధువు హైమాన్ డార్ఫ్ కళమ్మ తల్లి ముద్దుబిడ్డ పద్మశ్రీ కనక రాజు గుస్సాడి గురించి తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. అంతు ఉముందు గ్రామ ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. ఇందులో మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్, గ్రామస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించాలి

- రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళలు దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక బాలభారతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళ పాత్ర ఎంతో గొప్పదని, కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే వివిధ వృత్తులలో మహిళలు రాణిస్తున్నారని అన్నారు. కమ్యూనిస్టుల అండతోనే ఆనాడూ పోరాటాలు నిర్వహించి మహిళలకు ఓటు హక్కు, కార్మిక చట్టాల సాధన లాంటి హక్కులను సాధించుకున్నట్లు తెలిపారు. ఆధునిక కాలంలో మళ్లీ మహిళలు బానిసత్వంలోకి నెట్టివేయబడుతున్నారని అన్నారు. వరకట్న వేధింపులు, అత్యాచారాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం లాంటివి జరుగుతున్నాయని, వీటన్నింటిని వ్యతిరేకిస్తూ రాబోయే కాలంలో మహిళలు ఉద్యమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ముంజం శ్రీనివాస్, జాదవ్ రాజేందర్, జిల్లా కార్యదర్శి ఆర్ త్రివేణి, నాయకులు రోజా, పద్మ, శారద, వినోద, మోరేశ్వర్, శ్రీకాంత్, అంకయ్య, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మాధవి

ఆరె కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తా

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఆరె కులస్తుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆరెకులస్తుల సంఘ భవనానికి ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణానికి రూ.25 లక్షలలను కేటాయించడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో ఆరెకులస్తులు అత్యధికంగా సిర్పూర్ నియోజకవర్గంలో ఉన్నారన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ తరపున నామినేటెడ్, రాజ్యాంగబద్ధ పదవులను అధిరోహించేలా అవకాశాలు కలిగేలా ప్రభుత్వానికి తనవంతు కృషి చేస్తానన్నారు. వీర చరిత్ర కలిగిన ఆరెకులస్తులను గత పాలకులు మాయమాటతో మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గత 15 సంవత్సరాల క్రింద కౌటాల మండల కేంద్రంలో ఆరె సంఘ భవనం నిర్మించడం జరిగిందని, మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే నియోజకవర్గ కేంద్రంలో రూ.25 లక్షలతో, దాహెగాంలో రూ. 25 లక్షలతో సంఘ భవనాలు నిర్మించడానికి ప్రజా ప్రభుత్వం పూనుకోవడం మనందరికీ గర్వదగిన విషయమని పేర్కొన్నారు. ప్రధాన సమస్యలైన ఓబీసీ, శివాజీ జయంతి సెలవు దినోత్సవ విషయాన్ని సీఎం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇందులో ఆరెకుల రాష్ట్ర, జిల్లా నాయకులు, కుల బంధావులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

బీసీ బాలుర వసతి గృహంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో వైద్యాధికారి డాక్టర్ ఉప్రే వినయ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. 46 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మాటాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా వార్షిక పరీక్షలు రాయాలన్నారు.ఇందులో వసతి గృహం వార్డెన్ మధుకర్, ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్ఎం రుక్మిణి, వాలంటీర్ దివ్య పాల్గొన్నారు.



రంజాన్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దారుల్ అన్సార్ ట్రస్టు సభ్యులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో ఆదివారం దారుల్ అన్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ రంజన్ మాసం పురస్కరించుకొని నిరుపేద కుటుంబాలకు రేషన్ కిట్లను అందిస్తున్నట్లు తెలిపారు. తమ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలో సర్వే నిర్వహించి 115 కుటుంబాలను ఎంపిక చేసి వారికి పప్పు, బియ్యం, చక్కెర, పసుపు, మిర్చి పౌడర్, నూనె, అల్లం, ఎల్లిపాయలు, గోధుమలు, గోధుమ పిండి, బేషన్ పిండి, చింతపండుతో కూడిన రేషన్ కిట్లను తయారు చేసి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు రూ. 500 అందించినట్లు తెలిపారు. ప్రతీ ఏటా నిరుపేదలకు తాము ఈ కిట్లను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రధాన కార్యదర్శి ముఫకం అహ్మద్, సంయుక్త కార్యదర్శి హాఫీజ్ రియాజ్, కోశాధికారి రహీం మల్నాస్, అబ్దుల్ షకీర్, సభ్యులు అబ్దుల్ ముఖీమ్, ఖాజా సలావుద్దీన్ పాల్గొన్నారు.

మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన మాలీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాలీ మహా సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు ఉమేష్‌రావు డోలే అన్నారు. జిల్లా కేంద్రంలోని అఖిల భారతీయ మాలీ మహా సంఘం భవనంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే దంపతుల ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మాలీలు ఎస్టీ జాబితాలో కొనసాగుతున్నారని రాష్ట్రంలో కూడా ఎస్టీలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేనున్నట్లు తెలిపారు. సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి ఘనంగా నిర్వహించే విధంగా జిల్లా నాయకులు కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలీలకు అత్యధిక సీట్లు కేటాయించే విధంగా కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. అప్పుడే లక్ష్యసాధన సులువుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నాగోసే శంకర్, జిల్లా అధ్యక్షుడు గుర్నులే మేంగాజి, సీనియర్ కార్యకర్తలు కావిడే దత్తు, మండల అధ్యక్షుడు బాబురావు, జిల్లా బీసీ రైతు సంఘం అధ్యక్షుడు వైరాగడే మారుతి పాల్గొన్నారు..

50 బాల్స్ క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సర్‌సిల్క్ వెల్ఫేర్ క్రికెట్ మైదానంలో ఆదివారం 50 బాల్స్ క్రికెట్ అండర్ - 17 రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో ఆరు జట్లకు చెందిన 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన జట్లు మే ఒకటో తేదీ నుండి ఐదో తేదీ వరకు పంజాబ్‌లో జరిగే పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో 50 బాల్స్ క్రికెట్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కట్టా ప్రసాద్, కార్యదర్శి ఏడు కొండలు, కోశాధికారి తిరుపతి, జిల్లా అధ్యక్షులు శామ్యూల్ పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-తిర్యాణి

మండల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ముద్దసాని పవన్ (25) టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్ మధ్యాహ్న సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి వివరాల ప్రకారం.. తాను 2024 బ్యాచ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం పొందానని, విధి నిర్వహణలో మెలకువగా ఉంటూ కళ్ల మంట తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించినట్లు పేర్కొన్నారు. ఆదివారం తాండూర్ ఐబి మార్గమధ్యలో గడ్డి మందు తాగాడు. సమాచారం అందుకున్న పలువురు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి పోలీస్ వాహనంలో ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది తరలించారని బాధితుడు పేర్కొన్నాడు.

నేటి నుంచి ప్రజావాణి యథాతథం

నవతెలంగాణ ఆసిఫాబాద్

పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుల ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నుంచి యథాతథంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

వ్యాయామంతో జ్ఞాపకశక్తి మెరుగు

నవతెలంగాణ-తాండూర్



మానసిక వ్యాయామం వల్ల తెలివితేటలు పెరుగుతాయని మాదారం ఎస్ఐ సౌజన్య తెలిపారు. ఆదివారం శ్రీవాణి నికేతన్ పాఠశాలలో కుమార్ బ్రదర్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మెదడు చురుకుదనంగా పని చేయాలంటే చదరంగం పజిల్స్ పూరించడం చిత్రలేఖనం పదకేళి వంటి ఇండోర్ గేమ్స్ ఆడలని తెలిపారు. చదరంగం పోటీల్లో ప్రథమ బహుమతి ఎం ప్రహర్ష, ద్వితీయ బహుమతి దేవాన్ష్, తృతీయ బహుమతి హరిచరణ్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎస్ఐ బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో చెస్ ఆర్బిటర్ సమ్మయ్య, వాణినికేతన్ కరస్పాండెంట్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నట్టు వానినికేతన్ ప్రిన్సిపల్ కవిత తెలిపారు.

ఉత్తమ స్టాఫ్ నర్స్‌గా ప్రశంసా పత్రం

నవతెలంగాణ-జన్నారం



ఉత్తమ స్టాఫ్ నర్స్‌గా జన్నారంకు చెందిన దాముఖ విజయలక్ష్మి మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే, ప్రేమ్ సాగర్ రావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రోగులకు అందుబాటులో ఉండి మంచి చికిత్సలు అందించినందుకు గాను ఆమెకు ఈ ఉత్తమ పురస్కారాన్ని అందజేశారు. మంచిర్యాల డీసీపీ ఎగిడి భాస్కర్, ఐసీడీఎస్ పీడీ రావుఫ్ ఖాన్, అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ సుధాకర్ నాయక్ ఇతర అధికారులు ఉన్నారు. ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న విజయలక్ష్మిని మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ మాజీ ఎంపీపీ మాదాడి సరోజన, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మండల ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ అభినందించారు.

తిరోగమనం వైపు మానవ మనుగడ

• మట్టి పాత్రలవైపు మొగ్గు చూపుతున్న వైనం • మార్కెట్‌లో మట్టి గిన్నెలకు బలే గిరాకి

నవతెలంగాణ-జైపూర్

నేటి తరానికి నాటి తరం ఆదర్శం కాబోతుందా అంటే అవుననే చెప్పవచ్చు. తాత ముత్తాతల నాటి ఆచరపు అలవాట్లు అందిపుచ్చుకోవడానికి నేటి తరం అర్రులు చాపుతుందని అనుకోవడంలో సందేహం లేదు. నిన్న మొన్నటి వరకు రసాయనాలను నమ్ముకున్న రైతు నేడు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని గుర్తిస్తున్నాడు. ఒకప్పుడు పాలిస్టర్ బట్టలు ధరించడం డాబు అనిపించుకున్న వారు నేడు కాటన్ ప్రపంచాన్ని వెతుకుంటున్నారు. స్టీల్ బోళ్ల వద్దు మట్టి పాత్రలు ముద్దు అంటున్నారు. మట్టిలో పుట్టి మట్టితో మనుగడ కొనసాగించి మధ్యలో వచ్చిన మార్పుతో కలుగుతున్న అనర్ధాలను గుర్తించి మళ్లీ పాత తరం ఆచార వ్యవహారాలు, అలవాట్లు ఆచరణలో పెడుతున్నామనడంలో సందేహం లేదు. నేల విడిచి సాము చేస్తే జరిగే పరిణామాన్ని నేటి సమాజం గుర్తించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే మానవ మనుగడ తిరుగు ప్రయాణం వైపు అడుగులు వేస్తుందని అనిపిస్తోంది.

మన తాత ముత్తాతల కాలం మట్టి చుట్టు తిరిగింది. పంట నుంచి వంట వరకు మట్టిని నమ్ముకుని జీవించిన మానవ సమాజంలో మార్పు మళ్లీ మనిషిని మనీషిని చేసిందనిపిస్తోంది. నాటి రోజుల్లో వంటింటిలో వంట పాత్రలు అన్నీ మట్టి పాత్రలే ఉండేవి. మధ్యలో కంచు, సత్తు గిన్నెలు ఆ తదుపరి స్టీల్ ఒక వెలుగు వెలిగింది. ఇప్పుడు ఇవేమి వద్దు మట్టి పాత్రలు ముద్దు అన్న భావన నేటి సమాజం భావిస్తోంది.

మట్టి పాత్రలే అయినా కొత్త హంగులతో





మట్టి పాత్రలే అయినా కొత్త హంగులతో మార్కెట్‌లో స్టీల్ ఇతర పాత్రలను తలదన్ని నిల్చున్నాయి. విద్యుత్ కుక్కర్లు, నాన్‌స్టిక్ ప్యాన్లు, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు, ఆర్టిఫిషియల్ రోజులకు గుడ్‌బై చెపుతున్న వారు మట్టి పాత్రలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. అయితే మట్టి పాత్రల్లో వంట చేయడం ఇప్పటి వారికి తెలియకపోయినా ప్రాధాన్యతా క్రమంలో మట్టి పాత్రల వినియోగంపై అవగాహణ పెంచుకుంటున్నారు. ఫలితంగా మట్టి పాత్రలకు మళ్లీ మంచి రోజులొచ్చాయని చెప్పకతప్పదు. మట్టి పాత్రలు అంటే కుండలు, గురుగులు, కడుముంతలు మాత్రమే కాదు నాడు వంట కోసం వినియోగించిన మట్టి పాత్రలు ఇప్పుడు మార్కెట్‌లో మనిషి ఆలోచనా విధానికి అనుగుణంగా మట్టితో చేసిన అన్ని రకాలైన వంట పాత్రలు నగరంలో దొరుగుతుండటం విశేషం. మట్టితో తయారు చేసిన కుక్కర్లు, కడాయిలు, ప్యాన్లు, జగ్గులు, గ్లాసులు, కప్ తదితర వంటింటి పాత్రలు విరివిరిగా లభ్యమవుతుండగా ఇందులో కొన్ని నాటి రోజుల్లో కూడ కన్పించలేదు. కాని ఇప్పుడు నాటి రోజుల్లో కన్పించని పాత్రలు కూడా మట్టితో చేసినవి మనం కొనుగోలు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కూడా అమ్మకాలవుతున్న మట్టి పాత్రలు రానున్న రోజుల్లో మార్కెట్‌ను మురిపిస్తుందనడంలో సందేహం లేదని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

మట్టి పాత్రలు, మెటల్ పాత్రలకు మధ్య తేడా..!

మట్టి పాత్రలతో కాలుష్యం ఉండదు. మెటల్ పాత్రలతో పోల్చితే వీటిలో మట్టి పాత్రలో వండిన ఆహారం మెల్లిగా, సమంగా ఉడుకుతుంది. మట్టికి సహజంగా హీలింగ్ ఎనర్జీ ఉంటుంది. అంతేందుకు మన మూడ్‌ను దానంతటదే మార్చె గుణం మట్టికి ఉంటుందని పరిశోధనల సారాంశం. మనం డిప్రెషన్‌లో ఉన్నప్పుడు మట్టికి దగ్గరగా పని చేస్తే మన మూడ్‌ను ఇట్టే మార్చేయటం ప్రత్యంగా గుర్తించవచ్చు. ప్రకృతి వైద్య విధానాల్లోను మట్టి వినియోగం ప్రాధాన్యతను మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఫలితంగా మట్టి పాత్రల్లో వంట మాత్రమే కాదు. అందులో ఆహారం తినడం, కాఫీలాంటి తాగడం రుచిగా ఉంటుందన్న అభిప్రాయాలు లేకపోలేదు. మట్టి పాత్రలకు అలవాటవుతున్న వారు ఇప్పుడు మార్కెట్లో లభించే వివిధ రకాలైన వాటిని కొనుగోలు చేస్తున్నారు. మట్టి పాత్రల్లో క్షార గుణం ఉండటం మూలంగా ఆహారానికి కొత్త ఇంపైన రుచిని ఆపాదిస్తుంది. కుండ చికెన్ అంటూ కొంత మంది మాట్లాడుకోవడం మనలో కొందరు వినిఉంటాం. నిజంగానే మట్టి పాత్రలో వండిన మటన్, చికెన్, చేపల పులుసు బలేగా ఉంటుందని మనం అనుభవంలో తెల్సుకోవల్సిన అవసరం. ఒక్క మాంసాహారం మాత్రమే కాదు మట్టి పాత్రలో వండేది ఏదైనా పప్పు, పులుసు, కూరగాయలు ఏవైనా వినసొంపుగా కాదు.. తినసొంపుగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఇక్కడ మరో విషయం కూడా తెల్సుకోవాలి. మట్టి పాత్రలో వంటలు చేసుకోవడంలో నూనె అతి తక్కువ అవసరమవుతుందని గమనించాలి.

మట్టి పాత్రల వాడకంలో జాగ్రత్తలు పాటించాలి

మట్టి పాత్రలను జాగ్రత్తగా వాడుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పగిలిపోవడం జరుగుతుంది. ఈ క్రమంలో మట్టి పాత్రలను శుభ్రం చేయడంలో ఇప్పుడున్నటువంటి డిటర్జెంట్‌లు వాడకూడదు. నిమ్మకాయ తొక్కలు, చింతపండు రిల్లలు, వేడి నీళ్లు, కొబ్బరి పీచుతో బహు చక్కగా శుభ్రం చేసుకోవచ్చు. వీటిని శుభ్రం చేసినప్పుడు ఆదరాబాదరాలగా కాకుండా నిమ్మలంగా పని పూర్తి చేసుకోవాల్సిన అవసరమని మట్టి పాత్రలు వినియోగించిన పలువురు పేర్కొంటున్నారు.



ప్రయివేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

ప్రయివేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి దాగం మల్లేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమగూడెంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వేములవాడలో మార్చి10, 11, 12వ తేదీలలో నిర్వహించే రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి దాగం మల్లేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో దళితుల పైన హింస, హత్యలు, అత్యాచారాలు దోపిడీలు రెట్టింపు స్థాయిలో జరుగుతున్నాయని, కావున దళితులకు ఆర్థిక రాజకీయ సామాజిక హక్కుల పరిరక్షణ సామాజిక న్యాయం కొరకు, కుల వివక్షత కుల నిర్మూలనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భూమిలేని దళితులందరికీ భూమి కేటాయించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళా రిజర్వేషన్లు అమలుపరచాలని, ప్రయివేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఎస్సీ సబ్ ప్లాన్ చట్టబద్ధంగా అమలు చేయాలని, దళితుల అభివృద్ధికి కేటాయించిన నిధుల దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహించేందుకు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ ప్రతిష్టను పెంపొందించుకోవడానికి వేములవాడలో జరుగు రాష్ట్ర సమావేశాలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోచం, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, నాయకులు దుర్గం సుధాకర్, మామిడి గోపి, చొప్పదండి శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, దొండ రాకేష్, అంబాల రాయమల్లు, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సంస్థకు నిబద్ధతతో పనిచేసిన సభ్యులను గుర్తించి నూతన రాష్ట్ర కార్యవర్గన్ని కోర్ కమిటీ సభ్యులు ఎరుకల రాజుగౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు భూమయ్య తెలిపారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య, గౌరవ అధ్యక్షుడు సేపూరి గోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జి పురంశెట్టి నాగేష్, ఉపాధ్యక్షుడు పెరుగు మల్లికార్జున్, అమరగుండ తిరుపతి, ప్రధాన కార్యదర్శులు పాలాజీ శ్రీనివాస్, పరకాల మహేష్, కన్వీనర్ సంద సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కాశెట్టి తిరుపతి, ఎండీ అలీమ్, కోశాధికారి అమర కొండ మల్లేష్, అధికార ప్రతినిధి సందెల తిరుపతి, కార్యదర్శి కొడిజుట్టు నరేష్, సంయుక్త కార్యదర్శి ఎండీ హస్సన్, ప్రచార కార్యదర్శి జునుగూరు నాగరాజు, ముఖ్య సలహాదారులు లింగం అంజన్న, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అన్నారు. ఆపదలో ఉన్న గల్ఫ్ కార్మికులకు సహాయం అందించడంతో పాటు, గల్ఫ్‌లో అమరులైన వారి మృతదేహాలను స్వదేశానికి తరలించడంలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఇకపై రెట్టింపు ఉత్సాహంతో పని చేసి, గల్ఫ్ కార్మికుల హక్కుల కోసం పోరాడతామని వెల్లడించారు. గల్ఫ్‌లో అమరులైన అన్ని కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అలాగే రాబోయే బడ్జెట్ సమావేశాలలో గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

కార్మికుల హక్కులకు నిరంతరం కృషి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల హక్కులకు నిరంతరం కృషి చేయాలని బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి, కోల్ అపెక్స్ కమిటీ, జేబీసీసీఐ, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ కొత్త కాపు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాతాడి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గనిలో కార్మికుల సమస్యలపై, యాజమాన్యం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల పనితీరుపై స్పందించే విధానంపై యువ నాయకులు దిశా నిర్దేశం చేశారు. కార్మికులకు హక్కులకై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి, పి. మాధవ నాయక్, మండ రమాకాంత్, రాజారెడ్డి, అప్పని శ్రీనివాస్, సారంగపాణి, కారంపూడి శ్రీనివాసరాజు సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, రాగం రాజేందర్, శ్రీరాంపూర్, ఏరియా కార్యదర్శి దొనకెన రమేష్, మందమరి ఏరియా వైస్ ప్రెసిడెంట్, గుర్రం ప్రదీప్ కుమార్, మందమర్రి ఏరియా సెక్రెటరీ గూడ శ్రీకాంత్, శ్రీరాంపూర్ ఏరియా ట్రెజరర్, బొంపల్లి రమేష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల పట్టివేత



నవతెలంగాణ-తాండూర్

తాండూరు సర్కిల్ పరిధిలోని కన్నెపల్లి మండలం సూర్జాపూర్ గ్రామంలో ఆదివారం ఉదయం కన్నెపల్లి వ్యవసాయాధికారి సాయి ప్రశాంత్, ఎస్ఐ గంగారాం సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో, బేరి నారాయణ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 140 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఆదివారం కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ కుమారస్వామి వివరాలను వెల్లడించారు. నకిలీ విత్తనాలను కలిగి ఉన్న బేర నారాయణ వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొండ గొర్ల రాజన్న, సురేష్ అనే వ్యక్తుల నుంచి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులైన బేర నారాయణ, కొండ గొర్ల రాజన్నలను అరెస్టు చేసినట్లు చెప్పారు. సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నారని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన, కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్లైపోసెట్ విత్తనాల వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని ప్రభుత్వ అనుమతిలేని నకిలీ విత్తనాలు రైతులు వాడ రాదని సీఐ తెలిపారు.

మహిళల రక్షణ కోసం పోరాడుదాం

నవతెలంగాణ-మంచిర్యాల





అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షురాలిగా సోమిడి సమ్మక్క ప్రధాన కార్యదర్శిగా సామల ఉమరాణి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ ఎన్నిక అనంతరం ఐద్వా ఆధ్వర్యంలో పలు తీర్మానలను చేశారు. పార్లమెంట్‌లో ఆమోదించిన 33 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చెయ్యాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ ఆర్థిక అభివృద్ధికి అమలు చేస్తామని, నెలకు రూ:2500, కూలి బందు కుటుంబం నెలకు రూ:1000 అమలు చెయ్యలని, హామీ ప్రచారానికే పరిమితం అయ్యిందని విమర్శించారు. మహిళ కుటుంబాల ఆర్థిక అభివృద్ధి కోసం స్వయం ఉపాధి, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, సెకండ్ ఏ ఎన్ ఎం, కస్తూర్బా, సింగరేణి కాంట్రాక్టు మహిళ కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేసి పలు షాపింగ్ మాల్స్, బిల్డింగ్ రంగంలో పని చేస్తున్నవారికి కనీస వేతనాలు, 8 గంటల పని విధానం అమలు అయ్యేల చూడాలని పలు తీర్మాణాలు ప్రకటించారు. పై సమస్యలపై పరిష్కారం కోసం మహిళలు పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుగా పోతు విజయ, బోగే నాగ జ్యోతి కార్యదర్శులు ఎండీ రఫీయా, వి నిర్మల కమిటీ సభ్యులుగా ప్రమీల, రేణుక, పద్మ, సరిత, తిరుపతమ్మ శీరిష ఎంపిక అయ్యారు.

శ్రీరాంపూర్ నూతన బ్రాంచ్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా హెచ్ఎంఎస్ యూనియన్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య అధ్యక్షతన ఆదివారం వేజ్ బోర్డు సభ్యులు, తెలంగాణ రాష్ట్ర హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శిగా పొన్నగంటి అశోక్, కోశాధికారిగా మీస కొమురయ్య, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా దుర్గం లక్ష్మణ్, యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా కంకణాల రంజిత్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఇప్పటివరకు శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన తిప్పారపు సారయ్య సెంట్రల్ కమిటీలో ఎన్నికయ్యారు. వీరితోపాటు గొల్ల సత్యనారాయణ, బోనాల శ్రీనివాస్, కంబాల నర్సయ్య, దుర్గం వెంకటేశ్వర్లు సెంట్రల్ కమిటీలో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన నాయకులు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడాలని అన్నారు. ఈ సమావేశంలో జక్కుల నారాయణ, ఆర్‌జీ 1 బ్రాంచ్ సెక్రటరీ పల్లె క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



నవతెలంగాణ-మందమర్రి

గత స్మృతులను తిరిగిస్మరించుకుంటూ పూర్వ విద్యార్థుల కలయిక ఆనందోత్సాహాల మధ్య సాగింది. జిల్లా ప్రజా పరిషత్ బాలుర పాఠశాల, బాలికల పాఠశాల 1999-2000 విద్యా సంవత్సరాల్లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత సిల్వర్ జూబ్లీ పేరుతో పాఠశాలలో కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాడు తరగతిలో అల్లరి చేసిన రోజులు, గురువులు నేర్పిన క్రమశిక్షణ, వారు ఉపయోగించిన ఊత పదాలు, దండించిన విధానం గుర్తు చేస్తూ మధురానుభూతుల్లో మునిగిపోయారు.

- ఉపాధ్యాయులకు గౌరవ వందనం.

తమ జీవితాల్లో మలుపు తిప్పిన గురువులను వేదికపైకి ఆహ్వానించిన విద్యార్థులు, పూల మాల వేసి, శాలువాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో అప్పటి ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, ప్రేమ్ సాగర్, జగన్, బాలికల ఉన్నత పాఠశాలలో నాగేశ్వర్‌గౌడ్, స్వామి, గురు ప్రసాద్, ఫక్రుద్దీన్, రమా, జ్యోతి లను ఘనంగా సన్మానించారు. గ్రూప్ ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ జ్ఞాపకాలను మదిలో నింపుకున్నారు. మహాసమ్మేళనాలు జరుపుకోవడం వల్ల స్నేహబంధం పటిష్టం అవుతుందని అభిప్రాయపడ్డారు. అపూర్వ కలయికను విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజర్లు కుడిపూడి శ్రీనివాస్, అరుణ్, మిడిదొడ్డి శ్రీను, రాజమౌళి, రాజు, చందు, వెంకటేష్, రమేష్‌లకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.



గోదావరి రోడ్డు యదావిధిగా కొనసాగించాల్సిందే



నవతెలంగాణ-జైపూర్

ఇందారం నుంచి గోదావరి నది వరకు గల రోడ్డు యదావిధిగా కొనసాగించాల్సిన అవసరమని గ్రామస్థులు పేర్కొన్నారు. గోదావరి రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంప వేసిన భూమి యజమానితో స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఫయాజోద్దీన్ ఫోన్‌లో మాట్లాడారు. గత కొంత కాలంగా రోడ్డు బాటగా ఉన్నటువంటి గోదావరి రోడ్డు రాకపోకలకు అంతరాయం కల్పిస్తూ వేసిన ముళ్ల కంచెను తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా రోడ్డు భూమికి సంబంధించిన యజమానితో ఫోన్‌లో మాట్లాడగా అందుబాటులో లేనందున నేరుగా వచ్చి సామరస్యపూర్వకంగా మాట్లాడుకుందామని హామీ ఇచ్చారు. గోదావరి రోడ్డులో ముళ్ల కంచె ఏర్పాటు చేసినట్లు తెల్సుకున్న కాంగ్రెస్ నాయకుడు ఫయాజోద్దీన్ గ్రామస్థులతో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ విషమై స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో మాట్లాడిన ఆయన ఇందారం గ్రామం నుంచి గోదావరి నది వరకు గల రోడ్డును పున: నిర్మించడంతో పాటు గోదావరి నది వద్ద స్నానాల ఘాట్ ఏర్పాటుకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో మండల ప్రజలతో పాటు శ్రీరాంపూర్ డివిజన్ పరిధి ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యేకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గడ్డం ప్రసాద్, అర్కె సంతోష్ యాదవ్, జక్కుల వెంకటేశం, నల్లి శ్రీకాంత్, దగ్గుల రవి, బాదెల సాయి, కాంతయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.